# మెఱుపులు: కవితలో సాంఘిక స్పృహ

- వేమూరి వేంకట రామనాధం

కవితలోని సౌందర్యం కథా వస్తువును మించిన ప్రసన్నగుణం. ఈ "ప్రసన్న" పదం నాకలం నుండి జారిన మఱు నిముసంలో నాకు గుర్తు వచ్చింది, నన్నయ పద్యంలోని "ప్రసన్నకథాకలితార్థయుక్తి" అన్న పదగుచ్ఛం. ఆపద్యంలో ఆయన సూచించాడు చివరి పదాలలో, తన రచన "జగద్ధితంబుగన్" ఉండవలెనన్న ఆకాంక్షను. ఈ మనోరథం ఎంత పవిత్రమైనదో చూడండి. తన రచన జగత్తునకు "హితం" కలుగ జేసేదిగా ఉండవలెనని ఆశించాడు. ప్రియమైనది, విన సొంపుగలది అన్న ఊహ కాదు ఆయనను ఊపింది, అది అంతకు మించిన గుణం - "హితం" -ధ్వనించేదిగా ఉండవలెనని ఆయన దీక్షకల్గి వ్రాశాడు.

ఈ ఉపోద్ఘాతానికి, నాయీ వ్యాసానికి గల సంబంధం సులభంగా అందఱకు స్ఫురిస్తుంది, అనుకుంటాను. "హితం సంఘానికి కల్గ జేసేట్లు తన రచన ఉండవలెనన్న కోరిక ఆయన తొలి పద్యాలలోనే ప్రస్ఫుటంగా నినదించబడింది.

మఱొక మలుపు. తన రచన కేవలం సంఘానికి సాన్నిహిత్యం కలదిగా ఉండటమే కాదు, అది సంఘానికి హితం కూర్చేదిగా కూడ ఉండవలెనని ఆపద్య - అంత - పదాలలో మనకు విదితం అవుతుంది.

"సాంఘిక స్పృహ" అన్న మకుటంగల ఈ వ్యాసానికి మన భాషలోని దాదాపు తొలి రచనలో మన "ఆదికవి" మనసులో ఉన్న యీ నిశ్చితభావం ప్రారంభసారస్యం గలదని ఊహిస్తున్నాను.

"సాంఘిక స్పృహ" అన్నది రచనలో రెండు విధాలుగా ప్రతిబింబించ వచ్చును. ఏదో యొక సాంఘిక సమస్య కథా వస్తువుగ లేక కథలోని ప్రముఖ విషయంగా కావ్యం అల్ల బడియుండవచ్చును. ఇది యీనాటి కొన్ని కవితాకావ్యాలలో కన్పడుతుంది. ఉదాహరణకు, స్వాతంత్ర్యసిద్ధిని గూర్చిన మూల ధ్యేయం కావ్యమంతా క్రమ్ముకు పోయి యుండవచ్చును. నేను వ్రాసిన "స్వాతంత్ర్యసిద్ధి" యన్న పద్యకావ్యం ఇట్టిదొక అచ్చమైన రచన. అలాంటివే భారత మాతృస్తవంతో, భారతదేశసౌభాగ్యం విశిష్ట - ఆందోళనగా గల కొన్ని యితర రచనలను పేర్కొనవచ్చును. శ్రీ బలిజేపల్లి రామమూర్తి వ్రాసిన శివాజిచరిత్ర ఒకటి; శ్రీ వి.పి.పి. బాలకృష్ణ వ్రాసిన ప్రబంధం "విశీర్ణశృంఖల" మఱొకటి, శ్రీకొండేపూడి సుబ్బారావు రచించిన ఇటీవలి "కవితామందాకిని" పద్యకావ్యంలో ఒక దీర్ఘభాగం: దేశభక్తి ప్రేరకమైన స్వాతంత్ర్యపిపాస గుఱించి. కావ్యం మొత్తం కాకుండా ఎన్నో పద్య/ గీత రచనలు ఈ మూలాంశం తావలంగా వ్రాసిన కవి శేఖరులెందఱో ఉన్నారు. శ్రీ రాయప్రోలు సుబ్బారావు యొక్క అతి ప్రసిద్ధ గేయం "ఏ దేశమేగినా ఎందు కాలిడిన" అన్నది బహుజన విదితమైన ఒక రచన. అలాంటిదే శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన "జయజయజయప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి" "పరాధికారవాచకమగు జాగిరున్ మనుప జాల స్వతంత్రత నూది నిల్పెదన్" అంటూ భారతమాతృభక్తి యుక్తమైన శివాజి చరిత్రను వ్రాసిన శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రి, "విస్ఫుటరేఖామృత కాంతిమూర్తి యనగా సొంపారి శుభాకృతిన్ నట్టియించున్ మన భారతాంబిక కళానల్ప ప్రకాశస్థితిన్" అంటూ "బోసు భారతము" వ్రాసిన శ్రీ అయితం కాళీవరప్రసాదరావు, మహాత్మునికి అంజలి చేస్తూ రసవంతమైన పద్యాలు వ్రాసిన జంధ్యాల పాపయ్యశాస్త్రి, ఈ వినుతికి అర్హమైన కవివతంస వర్గంలో మఱి కొందఱు. దేశమాత యెడ భక్తి - అభిమానములు సాంఘికస్పృహలో విశిష్టమైన విభాగములు గదా. దేశమనగా సంఘము యొక్క - కాదు, ఉన్న సంఘములన్నింటి యొక్క మూలమాతృక. ఆదృష్టిని రచించిన పద్యాలు సాంఘిక స్పృహలోని అత్యగ్రశ్రేణికి చెందుతాయని చెప్పవచ్చును.

ఈ స్పృహ మన దేశంలో స్వాతంత్ర్యం కోసం ప్రజలందరు పోరాడే దినాలలో, దాని అర్జనకై వలసిన పట్ల ప్రాణాలను కూడ అర్పించ సిద్ధపడిన పరిస్థితులలో ఎందఱో వ్రాసిన కవితలు సాంఘిక స్పృహదృష్ట్యా ఉన్నత జాతికి చెందినవని మనం ప్రతిపాదించవచ్చును. (అవి అన్నీ అదే కారణంగా ఉత్తమ కవిత్వశ్రేణికి చెందుతాయా, అన్నది వేఱే ప్రశ్న.)

ఇక సాంఘిక స్పృహయే పూర్తి కావ్యకథా వస్తువు కాకుండా ఉన్న సందర్భాలు సూక్ష్మంగా చర్చించుదాం. మన పూర్వ కావ్యాలు ఎక్కువగా మనం ఈ నాడు సాంఘిక సమస్యలు, అనుకొన్న విషయాలను గుఱించి ప్రధాన దృష్టిని బఱచినవి కావని ఊహించవచ్చును. (కాని అవి కవిత్వ సంపదలో అనిర్వచనీయ ప్రాముఖ్యం గలవియే,) చాల ప్రబంధాలలో

మనం "సాంఘిక" మనుకునే కథావస్తు విశేషం అతి స్వల్పం అని చెప్పవచ్చును.

కాని దాదాపు ఆదిగ్రంథమైన మహాభారతంలో గాని, అంతకన్న వెనుకటి యుగాలకు చెందిన కథను చిత్రించే రామాయణంలో కాని సాంఘికస్పృహ గల సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. కొన్ని సూక్ష్మంగా, ఉదాహరణప్రాయంగా సూచిస్తాను.

శ్రీ రాముడు సీతను అడవికి పంపాడు (ఆమెతో అలా అని చెప్పకుండానే, కేవలం తమ్ముడు లక్ష్మణునితో రహస్యమైన సంప్రదింపుతో). ఆ నిర్ణయానికి కారణం వానికి గల సాంఘిక స్పృహయే. తాను ఏలిక, తన భార్యను గురించి ప్రజలలో చిన్నచూపు - ఏదో పిచ్చికారణంగా నైనా - ఉండ కూడదు, అది ఉన్నదని తనకు వ్యక్తం అయినప్పుడు దానికి ప్రతిగా తాను - రాజుగా- ఏదో ముఖ్య నిర్ణయం తీసికోవాలి, ఉన్న ఉద్దేశ్యంతో శ్రీ రాముడు ఆమెను అడవి పాలు చేశాడు. లెక్కకు మించిన ప్రజాబాహుళ్యములో ఏదో ఒక నిందాస్ఫోరక దూషణ ఉండకపోదు, దాని మూలంగా తన భార్యను అడవుల పాలు చేయటమేనా, అని సకారణంగా ప్రశ్న రేకెత్తుతుంది; నిజమే కాని ప్రధాన విషయమేమంటే సాంఘికదృష్టి ఏకొలదిమందిదైనా - అలా ఉన్నది, అన్న ఎఱుక కలిగిన వేంటనే ప్రజలను పాలించే రాజు దానికి స్పందించ వలసిన అవసరం ఉన్నది, అన్న మూల సత్యాన్ని నిరూపించే ఘట్టమిది. అతని నిర్ణయం ఎలాంటిది అన్నది మఱొక ప్రశ్న.

మహాభారతానికి వస్తే, మనకు పనికి వచ్చే ఉదాహరణలు ఎన్నో దొఱుకుతాయి. మొదటగా కుంతి ఉదంతం కొంతగా గుఱుతు చేసికొందాం. తనకు లభ్యమైన విచిత్రవరం యొక్క శక్తిని పరీక్షించ వలెనన్నట్లు చిలిపి కోరిక కలిగి సూర్యుని తలచుకొని, ఫలితంగా కర్ణుని కన్నది. కాని బాలిక, అవివాహిత; లోన ఉజ్జ్వలించిన భయచింతన వలన - అనగా సంఘం తనను ఏవిధంగా గర్హిస్తుందో అన్న బెంగవలన - వెంటనే ఆ శిశువును బైట వదిలింది. తరువాత పల్లెవాడు ఆబిడ్డను గమనించి పెంచాడు; కథ జరుగుతుంది, మనకు తెలుసుగదా.

పరిపాలకునికి వలసిన సాంఘిక స్పృహను గుఱించిన సూటియైన ఘట్టమొకటి ఉంది భారతంలో. నారదుడు ధర్మరాజుకు ఆ విషయమై అనేక వివరాలు విశదం చేస్తాడు. "ఇది యిలా" అంటూ, "అని " నీకు తెలుసును గదా" అని బోధించాడు. ఈ అంశాలు వెనుక నొక "మెఱుపు" లో నేను తెలియజేశాను.

ద్రౌపదీ వస్త్రాపహరణ సందర్భంలో నిరూపించబడింది దుర్యోధన దుశ్శాసనులకు సాంఘికస్పృహ లేదని. అంతే కాదు; ఆఘట్టంలో - మఱికొన్నింటిలో కూడ - సాంఘిక స్పృహకు సమానాంతరంగా విలసిల్లిన రాజభక్తి భీష్మద్రోణాది మహామహులనే మౌన దురవస్థలో ముంచివేసింది.

ఇలాంటి సాంఘికస్పృహ - మంచిచెడులను పరికించి అనుసరించే ప్రవర్తన - అక్కడక్కడ మన విఖ్యాత పూర్వ గ్రంథాలలో లేకపోలేదు. విభీషణుడు రావణుని అకార్యాలకు రోసి వానిని వీడిపోయిన దొక విశిష్టమైన విషయం.

మఱొక పూర్వగాథలోని విషయం ఈ సందర్భానికి అనువైనది గమనించుదాం. శకుంతలను తిరిగి చూడని దుష్యంతుని యొద్దకు ఆమె వచ్చి వెనుకటి కథను గుఱుతు చేసినప్పుడు ఆ మహారాజు తనకు అది జ్ఞప్తి లేదని గట్టిగా అఱచాడు. (చివరకు ఇరువురు కలిశారనుకొనండి.) "అలా ఎందుకు అన్నావయ్యా" అంటే, "లేకుంటే అందఱు ఇలాగే వస్తూ ఉంటారు" అన్న సాకు చెబుతాడు. సాంఘికస్పృహకు ఎంత సూటియైన ఉదాహరణ యీ కథ!

మన పూర్వ కావ్యాలలో, సాంఘికస్పృహ ఎంత అవసరమైన మనస్థితియో, అంతకు దీటైన - అప్పుడప్పుడు మించిన - సత్యదీక్షకూడ మనకు స్పష్టంగా విశదమవుతుంది. ఒక ఉదాహరణ - అందఱకు తెలిసిన కథయే- దశరథుడు సరిగా "గడ్డు" సమయంలో తాను వెనుక ఎన్నడో ఇచ్చిన వరం కారణంగా కైకేయి కోర్కెలను - బ్రహ్మవరాలను - తీర్చవలసి వచ్చింది. ప్రజ, పరిపాలన, నాటి పరిస్థితి - ఇలాంటి విషయాలను సమూలంగా చర్చించుకొనకయే, ఏనాడో తానిచ్చిన మాట తప్పరాదన్న "నీతి" పోటులో రాముడిని అరణ్యాలకు పంపాడు. తన ప్రజ యొక్క దృష్టి ఏమా, తన రాజ్యసౌష్టవానికి కలిగే మేలు కీడు సందర్భాలు ఏవియా, అన్న దృష్టి లేక తాను తన భార్యకు ఎన్నడో - ముందు పరిణామాలు తెలియక ఇచ్చిన వరం నిలుపుకొనటమే ప్రధానం అని నిర్ణయించాడు దశరథుడు. సాంఘికస్పృహ చాల మంది తలంపులో వలసిన రీతిగా వానికి నిశ్చయ యోగ్యతను కలిగించక, అంతకుమించిన సత్యవాక్పరి పాలనయే వాని మనస్సును, హృదయాన్ని కదలించిందని రామాయణ కథ. ఆ నిర్ణయం బీజంగా ఎన్ని విపరీత పరిస్థితులు రెమ్మలు కొమ్మలుగా పెకలినవో, మనకు తెలియునుగదా.

పైకి నిశ్చితంగా ప్రకటించని మనోదౌర్బల్యంతో రాముడు రావణవధానంతరం సీతను తీసికొని పోవటంలో కూడ తడబడిపడి, దరిదాపు "రావద్దు" అని ఆమెను గదమాయించటం కూడ వాని మనస్సులో గలగల లాడిన సాంఘికస్పృహ దృష్టియే. అన్ని యేండ్లు ఆ రాక్షసుని బందీగా ఉన్న స్త్రీని మహారాణి హోదాలో తనతో తెచ్చుకొనటం తనకు నచ్చలేదు - సంఘం ఏమనుకుంటుందో ఆమెను

మహాభారతం నిండా సాంఘికస్పృహ గల ఉదంతములు, సంఘటనలు ఎన్నో ఉన్నాయి; అలాగే రామాయణకథలో కూడ. ప్రబంధబాహుళ్యంలో కవితా సౌదర్యం ఉన్నది కాని, సాంఘికస్పృహ - మనం చర్చిస్తున్న రీతిని - కొంత తక్కువగా ఉన్నదనిపిస్తుంది. అన్ని కథలకు ఈ తీర్మానం సమానంగా వర్తించదని ప్రత్యేకంగా నేను చెప్పనక్కఱలేదు .

ఇటీవలి కవిత్వములో సాంఘికస్పృహ అధికంగా ఉన్న ప్రశస్త ఉదాహరణం శ్రీశ్రీ రచనలు. పాఠకలోకానికి చిరపరిచితమైన "మరో ప్రపంచం మరోప్రపంచం మరో ప్రపంచం పిలిచింది" అన్న గేయం నిండా నూతన - ప్రపంచం - ఉద్యోగం విజృంభించటమే కాక, అది చక్కని కవితా సౌందర్యంతో ముడివేసికొని యుంది. "కనబడ లేదా..." "వినబడలేదా..." అన్న చరణాలు కనులకు నూతన సాంఘిక స్తోమతను, ఆక్రందనలను వ్యక్తం చేస్తాయి.

ఇలా ఉదాహరణలు ఇస్తూ పోవటం కన్న, నేనిటీవలి సంవత్సరాలలో వ్రాసిన యెన్నో పద్య ఖండికలు సాంఘిక స్పృహను తమకు నివేదిస్తాను. ప్రస్తుతం ముద్రణలో ఉన్న కవితా సంచయంలో - "వాణీవేణి" అన్న గ్రంథనామంతో - ఎన్నో సుదీర్ఘమైన ఖండికలు సాంఘిక - ఉద్రేక - విషయకంగా ఉన్నాయి. 9-11 నాటి దౌర్జన్యాలు, "చెలిమి కలిమి" అన్న శీర్షిక క్రింది హిందూ - ముస్లిం బాలుల శుద్ధసాంగత్యం, "పేదవెంకన్న" అన్న శీర్షికతో పేదరికంలో మ్రగ్గుతున్న కార్మికుల జీవితం, ఇంకా "వీధిబస" మొదలయిన వాస్తవిక ఖండికలు ఉన్నాయి. ఇదంతా ఇక్కడ పేర్కొనటం కేవలం నాయిటీవలి కవిత్వవిహారంలో సాంఘికప్రాముఖ్యం ప్రత్యేకంగా గల యెన్ని ఖండికలు ఉన్నవో మనవిచేయటానికి మాత్రమే. వెంటనే ఒక అదనపు మాట విన్నవిస్తాను. వాటి కథావస్తువును ఇలా పేర్కొన్నాను గాని, నిక్కంగా వాటికి దక్క దగిన గుఱుతింపు వాటిలో గల కవితాసౌందర్యం మీద ఆధారపడియుంటుందని వక్కాణిస్తున్నాను.

గూర్చి అన్నదొక సందియం, తాను రాజుగా ఈ సందర్భంలో ఎలా నిశ్చయించాలా అన్నది మఱొక ప్రశ్న. ఈ రెంటి మధ్య ఆయన ఊగులాడాడు. చివరకు, కథలో ఉన్నట్లు పంచభూతములు, బ్రహ్మ మొదలయిన వారందఱు సీత పక్షం పలకగా ఆనిర్దోష స్త్రీని స్వీకరించి తనతో తీసికొని వెళ్ళాడు శ్రీ రాముడు.

కేవలం సాంఘికరచనను వ్యాసంగా కూర్చవచ్చును. పద్యంగానో గేయంగానో కూర్చినప్పుడు దానిలో కథావస్తువు కన్న రచనాసౌందర్యం ఎంత ఉన్నది అన్న ప్రశ్న ముఖ్యమని మనవి చేస్తున్నారు.

మఱొక సాహస పూర్ణమైన వాక్యంతో ఈ వ్యాసం ముగిస్తున్నాను. ఈనాటి సాంఘిక సమస్యలు, ప్రజాప్రవర్తన రీతులు, వర్గాలలోని ఒడుదుడుకులు, కవితాదృష్టితో గమనిస్తే, చక్కని కవిత అల్లటానికి అనుకూలమైన విశేషాలెన్నో మనకు దృశ్యమవుతాయి. అయితే, తిరిగి ఒక్క షరా: అవి కవితలో ఇముడ్చాలి, కేవలం వార్తాపత్రికలో లాగా కాకుండా. దీని ప్రాముఖ్యం దీనిదే, దాని గడిదానిదే.